# శంకరాచార్యుల వారి

# నిర్వాణషట్కం

వివరణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



### శంకరాచార్యుల వారి

# నిర్వాణషట్కం



**వివరణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు**


మొదటి ముద్రణ : ఆగస్టు, 2025

ప్రతులు : 2,000

వెల : **రూ.40/-**



పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**


తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) గురుపౌర్ణమి విశిష్టత | - | రూ.60/- |
| 8) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 9) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 10)పంచకోశాలు | - | రూ.60/- |
| 11) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 12) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 13) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,



# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Die before death! | Rs.120 |
| 4. | The Law of Karma | Rs.100 |
| 5. | What is Meditation? | Rs.80 |
| 6. | True Path | Rs.80 |
| 7. | Why soul-knowledge ? | Rs.70 |
| 8. | What comes after death ? | Rs.70 |
| 9. | How to improve Financial Status ? | Rs.60 |
| 10. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 11. | What is Intention? | Rs.50 |
| 12. | Why is this life? | Rs.50 |
| 13. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 14. | Meditation for the Development of Students | Rs.40 |
| 15. | Non violence and vegetarianism | Rs.40 |

# శంకరాచార్యుల వారి నిర్వాణషట్కం

**“వేరు చేసే విధానం చేత ఇది కాదు, ఇది కాదు అని అసత్ వస్తువుల్ని వేరు చేసిన తర్వాత ఏదైతే వేదాంత శాస్త్రం చేత సూచింపబడిందో అదే బ్రహ్మం. అంతేకాదు ఏదైతే ద్వయం కానిదో, నిరంతరము ఆనంద స్వరూపం అయినదో, ఏకమైనదో అది బ్రహ్మమని తెలుసుకోవాలి”.**

అంటే ఇక్కడ సృష్టిలో అసత్యము, సత్యము రెండూ కలిసి ఉన్నాయి. వాస్తవము, అవాస్తవము రెండూ కలిసి ఉంటాయి. రాక్షసులు, దేవతలు కలిసే ఉంటారు. అన్నీ కలిసి ఉన్నదే ఈ సృష్టి, ఈ ప్రపంచం.

మాయ, సత్యం ఈ రెండు కూడా కలిసే ఉంటాయి. విచిత్రం ఏమిటంటే? ఈ మాయే అంటే ఈ అసత్యమే, సత్యంగా అనిపిస్తూ ఉంటుంది. అందుచేత వీటిని వేరు చేయాలి. ఎలా? ఒక్కొక్క దాన్ని తీసుకొని ఇది సత్యం కాదు, ఇది సత్యం కాదు, అని అసత్యమైన వస్తువులన్నిటిని వేరు చేసి, అంటే పక్కకు పెట్టిన తర్వాత చివరికి ఉన్నది వేదాంత శాస్త్రం లో చెప్పబడిన బ్రహ్మం అని తెలుసుకోవాలి.

ఆ అసత్య వస్తువులు, విడదీయవలసినవి, ఏరవలసినవి ఏమిటి అన్న విషయాలన్నీ కూడా శంకరాచార్యుల వారు నిర్వాణ షట్కంలో చాలా విపులంగా ఇవ్వడం జరిగింది.

షట్ అంటే ఆరు. నిర్వాణ షట్కం అంటే నిర్వాణం పొందిన వారి స్థితి ఏంటో ఈ ఆరు శ్లోకాల్లో చెప్పడం జరిగింది. ఇది మీరు గ్రహించగలిగితే, ఆ స్థితికి మీరు ఎదగగలిగితే, మీరు నిర్వాణం పొందినట్టే. ఇంకా మీరు ఆ భావంతో ఉంటే ఆ స్థితి సంపాదించడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. అందుచేత ఈ ఆరు శ్లోకాల్లో శంకరాచార్యుల వారు చెప్పిన విషయాలు ఒక్కసారి మనం చూద్దాం.

1) మనో బుద్ధ్యహంకార చిత్తాది నాహం
న చ శ్రోత్ర జిహ్వే న చ ఘ్రాణనేత్ర ।
న చ వ్యోమ భూమి ర్న తేజోన వాయుః
చిదానంద రూపః శివోహం శివోహం ॥

తాత్పర్యం: మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అను నాలుగు విధాలైన వృత్తులతో కూడిన అంతఃకరణము నేను కాను. ముక్కు, కన్ను, చెవి, నాలుక, చర్మము అనెడి జ్ఞానేంద్రియాలు నేను కాదు. ఆకాశము, భూమి, జలము, అగ్ని, వాయువు అనెడి పంచభూతములు నేను కాదు. చిదానంద రూపుడనగు శివుడనే నేను, శివుడనే నేను.

శ్రీ శంకరాచార్యుల వారు మనస్సు నేను కాదు అని చెప్పారు. కానీ ప్రతి ఒక్కరు ఆ మనసుకే ప్రాముఖ్యం ఇస్తున్నారు, ఆ మనసునే తృప్తి పరచడానికి ప్రయత్నిస్తున్నారు, జీవితాన్ని దానికే అంకితం చేస్తున్నారు. ఇంతా చేసి మనసు నువ్వా అంటే మనసు నువ్వు కాదు.

మీరు చూడండి ఈ బాహ్యేంద్రియాలు అంటే జ్ఞానేంద్రియాలు కానీ, కర్మేంద్రియాలు కానీ, మనసును బట్టే పనిచేస్తున్నాయి. మనసు చెప్పినట్టుగానే అవి వింటున్నాయి. ఈ ఇంద్రియాల ద్వారానే మనసు ఎంతో తృప్తి పడుతుంది. అందుచేత మానవుడు జీవితకాలమంతా మనసుని తృప్తి పరచడానికే ప్రయత్నిస్తున్నాడు. మనసు కూడా ఈ ఇంద్రియాల ద్వారా సుఖపడాలని కోరుకుంటుంది.

కళ్ళ ద్వారా నచ్చింది చూడాలని, చెవుల ద్వారా నచ్చింది వినాలని, ముక్కు ద్వారా నచ్చింది వాసన చూడాలని, నాలుక ద్వారా నచ్చినవన్ని భుజించాలని, చర్మం ద్వారా సుఖపడాలని వేసవికాలంలో ఏసీలు, అలాగే చలిగా ఉన్న ప్రదేశాల్లో హీటర్లు పెట్టుకుని నచ్చినట్టుగా ఉండాలని ప్రయత్నిస్తూ వుంటుంది.

అలా జీవిస్తూ ఎంతో సుఖపడ్డానని భావిస్తారు. సరే సుఖ

పడుతున్నారు, సుఖపడడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతకీ ఈ సుఖం ఎవరు అనుభవిస్తున్నారు? ఆ సుఖాన్ని మనసే అనుభవిస్తుంది. మరి ఆ సుఖం కోసం జీవితం అంతా ప్రయత్నిస్తున్నారు. మరి మనసుకి ఇలాంటి సుఖం కలగాలి అంటే ముఖ్యంగా డబ్బు కావాలి.

అందుకే ప్రతి ఒక్కరు కూడా డబ్బు సంపాదనకి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ.. రోజులో ఎక్కువ సమయం దానికే కేటాయిస్తున్నారు. కొంతమంది ఉద్యోగం చేస్తున్నారు, కొంతమంది వ్యాపారం చేస్తున్నారు, మరి కొంతమంది ఎవరి నైపుణ్యాన్ని బట్టి వారు ఏదో ఒక వృత్తిలో ఉన్నారు. ఇంకా రకరకాలైనటువంటి పద్ధతుల్లో డబ్బు సంపాదిస్తారు.

దేనికి అంటే? మనసును తృప్తి పరచడానికి.  జీవితకాలం అలా తృప్తి పరుస్తూనే ఉన్నారు. ఇంతకీ ఈ మనసు నువ్వా? అంటే నేను కాదు. ఇంతకీ నువ్వు ఎవరు? అంటే చిదానంద రూపుడునగు శివుడనే నేను అని చెప్పారు శంకరాచార్యులవారు. ఎప్పుడూ ఆనందంగా ఉండే ఆనందమే స్వరూపంగా గల శివుడు అంటే ఆ బ్రహ్మమే నేను. దాన్నే ఆత్మ అని కూడా అంటారు. అంటే మీరు ఆత్మై ఉండి మొత్తం జీవితం జీవితం ఈ మనసుకే దాసోహం అయిపోయారు. మనసును తృప్తి పరచడానికే మీరు కష్ట పడుతున్నారు, సంపాదిస్తున్నారు, సుఖ పెడుతున్నారు.

అందుకే పత్రిగారు అవసరాలకు పరిమితం అవ్వాలి. కోరికలకు బానిస అవ్వకూడదు అని చెప్పారు. కోరికలు అన్నవి మనసుకు సంబంధించి నవి, అవసరాలు శరీరానికి సంబంధించినవి. ఈ శరీరం మనుగడ సాగించాలి అంటే దానికి కొన్ని అవసరాలు ఉన్నాయి. వేళకు ఇంత తిండి తినాలి. దానికే పత్రి గారు చెప్తారు ఒక రొట్టె ముక్క, ఆవకాయ తొక్క సరిపోదా అని.

అంటే అలా జీవించమని కాదు. ఏది ఉంటే దాన్ని శరీరానికి ఇస్తే అవసరం తీరిపోతుంది. ఏదో ఒక బట్ట కడితే అవసరం తీరిపోతుంది. దానికి పట్టు చీరలు, పట్టు వస్త్రాలు అవసరం లేదు. ఏదో ఒక ఇల్లు ఉంటే

సరిపోతుంది. ప్యాలెస్‌లే అక్కర్లేదు.

ఎందుచేత ఆత్మవైన నువ్వు ఉన్నతమైన స్థితికి చేరుకోవాలి అంటే కావలసిన సాధన, సంపాదించ వలసిన జ్ఞానం శరీరం ఉంటేనే సాధ్యం. ఆ శరీరం తెల్లగా ఉన్నా, నల్లగా ఉన్నా, పొడుగ్గా ఉన్నా, పొట్టిగా ఉన్నా, ఎలా ఉన్నా సరే ఆత్మకు ఉన్నతి కలిగించే పనులు, లాభం కలిగించే పనులు ఈ శరీరంతో చేయాలి. అందుకే ఆత్మయిన మీరు భూమి మీదకి వచ్చి ఈ శరీరం తీసుకున్నారు. అంతేకానీ ఆ దేహాన్ని సుఖపెట్టడానికి మీరు భూమి మీదకి రాలేదు.

విచిత్రం ఏమిటంటే ? ఏ దేహంతో అయితే మీరు సాధనలు చేయించాలనుకున్నారో ఆ దేహం అవి మానేసి మధ్యలో ఉన్నటువంటి మనసు యొక్క ప్రాముఖ్యం లో పడిపోయింది. ఆత్మైన మిమ్మల్ని ఆ శరీరం పట్టించుకోవట్లేదు. వచ్చింది ఒకదాని కోసం, చేస్తున్నది ఇంకోటి. మరి దీనికి కారణం ఎవరు? అంటే మనసే దానికి కారణం. ఈ మనసు యొక్క మాయలో పడి శరీరాన్ని ఒకదానికి ఉపయోగించుకోవాల్సింది ఇంకొక దానికి ఉపయోగిస్తున్నారు.

నిజంగా చెప్పాలంటే ఎవరైతే జూమ్ లోకి వస్తున్నారో, భీమవరం వస్తున్నారో, వాళ్లే మనసు యొక్క మాయలో నుంచి బయట పడడానికి ప్రయత్నం చేసేవాళ్ళు. ఇక మిగతా వాళ్ళంతా కూడా మనసు యొక్క మాయలో చిక్కుకొని అలాగే జీవిస్తున్నారు. ఎందుచేతనంటే పై లోకాల్లో ఉన్నప్పుడు ఆత్మ ఒక్కటే ఉంటుంది కాబట్టి ఆ ఆత్మ కొన్ని నిర్ణయాలు తీసుకుంటుంది. దాన్నే ప్రణాళిక అంటారు. ఆత్మ అయిన తాను దేహం తీసుకొని ఆ రకమైన పనులు చేయాలని ఒక ప్రణాళికతో భూమ్మీదకి వస్తుంది.

అక్కడ ఉన్నది ఆత్మే కాబట్టి అక్కడ ఉన్నప్పుడు ఆత్మకు గొప్ప గొప్ప వాళ్ళ చేత కొన్ని కౌన్సిలింగ్లు జరుగుతాయి. వాళ్ళు ఎంతసేపు ఆత్మ లాభం గురించే చెప్తారు. వాళ్ళు ముందే చెప్తారు నువ్వు భూమి మీదకి వెళ్తున్నావు,

శరీరం తీసుకుంటావు, శరీరంతో పాటు మనసు కూడా తయారవుతుంది, దాని మాయలో పడకు, దాని ప్రలోభాలకు లొంగకు, వాటికి ఆకర్షితుడివి కాకు, ఆ మనసుకు బానిస కాకు, ఈ పనులు చెయ్యి నువ్వు ఎంతో గొప్పవాడు అవుతావు అని అక్కడున్న మీకు అంటే ఆత్మకు పైన ఉన్నటువంటి ఆ కౌన్సిలింగ్లు చేసేవారు సలహా ఇస్తారు.

కానీ భూమి మీదకు వచ్చి శరీరం తీసుకున్నాక ఇవేమి గుర్తుండవు. శరీరం ఒకటే కనిపిస్తుంది కాబట్టి అదే నేను అనుకుంటారు. ఆత్మ గురించి అసలు అవగాహన ఉండదు. అందుచేత ఆ శరీరానికి లాభం కలిగించే పనులే చేస్తూ ఉంటారు. భూమి మీదకి వెళ్ళాక మనం మర్చిపోతామన్న సంగతి ప్రకృతికి తెలుసు.

అందుచేత ప్రకృతిలో ఒక ఏర్పాటు ఉంది. ప్రకృతి ఏమి చేస్తుందంటే? జీవితంలో జరిగే ఎన్నో సంఘటనల ద్వారా, అలాగే కొంతమంది మాయను జయించిన సద్గురువుల ద్వారా తన కర్తవ్యాన్ని బోధిస్తూ, తన లక్ష్యాన్ని గుర్తు చేస్తూ, తన ప్రణాళిక ప్రకారం జీవించాలని తెలియపరుస్తూ ఉంటుంది.

అలాగే ఈ ప్రపంచంలో వీటిని తెలియపరచడానికి గొప్పవాళ్ళు, యోగులు వ్రాసిన ఎన్నో జ్ఞానవంతమైన పుస్తకాలు ఉన్నాయి. ఆ పుస్తకాల ద్వారా కూడా ఇవి తెలియజేయబడతాయి. ఇలా ఎన్నో రకాలుగా ప్రకృతి ఆత్మ మర్చిపోయిన విషయాల్ని గుర్తు చేస్తుంది. అంతే కాదు అంతరాత్మ ప్రబోధం ద్వారా అంటే ఆ శరీరంలో ఉన్న ఆత్మ ద్వారా హెచ్చరిస్తూనే ఉంటుంది. ఇన్ని రకాలుగా గుర్తు చేసినా కూడా బలమైన మాయా ప్రభావానికి లోనైనటువంటి మనసు వీటిని లెక్క పెట్టకుండా తన సుఖమే చూసుకుంటుంది.

మీరు ఒక్కసారి రమణ మహర్షిని గమనించండి. ఏది ఉంటే అదే తినేవాడు. ఆయన బట్టల కోసం అలంకారం కోసం లక్షలు, కోట్లు ఖర్చు పెట్టలేదు. ఏదో ఎండ నుంచి, వర్షం నుంచి రక్షణ కోసం చిన్న ఇంట్లో

ఉండేవాడు అంతే. ఏ కోరికలు లేవు, పూర్తిగా అవసరాలకు పరిమితమై ఆత్మోన్నతికే పాటుపడ్డాడు. అలా మీరేం జీవించక్కర్లేదు.

ఉన్నవి అనుభవించండి, లేవని ఏడవకండి, అవి సంపాదించడానికి తప్పులూ, పాపాలూ చేయకండి. కుటుంబాన్ని సంసారం చూసుకుంటూ మీ ఖాళీ సమయం ఆత్మకు కేటాయించండి అని పత్రి గారు బోధించడం జరిగింది. అవసరాలు మానేయమని ఆయన ఏం చెప్పలేదు. సంసారం చేస్తూనే నిర్వాణం సాధించమన్నారు. సంసారంలోనే నిర్వాణం అన్నారు పత్రిగారు.

అందుచేత ఎవరైతే ఈ అంతఃకరణమైనటువంటి మనసు నేను కాదు అని తెలుసుకుని తీవ్ర సాధన చేత ఆ మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గించి, మనసును తన అధీనంలో ఉంచుకుంటారో వారే నిర్వాణం పొంద గలుగుతారు. అలాంటి స్థితి సంపాదించి ఇవి నేను కాదు, నేను శివుడను, అని ఎవరైతే బ్రహ్మాన్ని అని తెలుసుకుంటారో వారు నిర్వాణం పొందినట్టు. ఇదే ఈ శ్లోకం ద్వారా శంకరాచార్యుల వారు బోధించడం జరిగింది.

ఆయన ఇంకా ఏం చెప్పారంటే కన్ను, చెవి, నాలుక అనే జ్ఞానేంద్రియాలు నేను కాదు. ఇంకేమన్నారంటే ఆకాశము, భూమి, జలము, అగ్ని, వాయువు అనే పంచభూతాలు నేను కాను. ఎందుకంటే శరీరం పంచభూతాలతో తయారు చేయబడింది. అవేవి నేను కాదు. నేను శివుడను, నేను బ్రహ్మాన్ని అని తెలుసుకోమన్నారు.

# శంకరాచార్యుల వారు చెప్పిన రెండవ శ్లోకం

ఈ సృష్టిలో కనిపించేవి కానీ సృష్టింపబడినవి కానీ ఏది శాశ్వతం కాదు. అవన్నీ కొంతకాలం ఉండేవే. అవన్నీ ఆ బ్రహ్మం చేత సృష్టింపబడినవే.

అందుచేత ఆ బ్రహ్మమే శాశ్వతమైనవాడు. ఆ బ్రహ్మ నుంచి ఉద్భవించిన అంశలు కూడా శాశ్వతమైనవే. సృష్టింపబడినవి వేరు, ఆయన నుంచి ఉద్భవించినవి వేరు. ఆయనచే సృష్టింపబడిన ప్రతీది కొంతకాలమే ఉంటుంది. అది సృష్టింపబడుతుంది. కొంతకాలం ఉంటుంది తర్వాత అదృశ్యమైపోతుంది.

కానీ ఆయనలోంచి ఉద్భవించినటువంటి ఆ అంశాత్మ కూడా బ్రహ్మమే. అంతా ఒకటే. అంశ, ఆయన రెండూ ఒకటే. అందుకే జీసస్ క్రైస్ట్ నేను నా తండ్రి ఒకటే, నేను మీరు ఒకటే అని అన్నాడు. ఇక్కడ మనమంతా కూడా సృష్టింపబడిన శరీరం నేను అనుకుంటున్నాం. కానీ ఈ కనిపించే, సృష్టింపబడిన శరీరాలు మనం కాదు. మనం ఆత్మలం. ఇదే తెలుసుకోవాల్సి నటువంటి రహస్యం, తెలుసుకోవాల్సినటువంటి సత్యం.

ఇది తెలుసుకునేదాకా ఎవ్వరైనా సరే జన్మలు తీసుకుంటూనే ఉంటారు. నిన్ను నువ్వు తెలుసుకుంటే జన్మే లేదు అంటారు. రమణ మహర్షి కూడా నిన్ను నువ్వు తెలుసుకో అంటారు. ఏం తెలుసుకోవాలి? నేనే బ్రహ్మము అని తెలుసుకోవాలి. ఎన్నో ఉన్నాయి, ఏదీ నేను కాదు. ఆ స్థితికి మనం చేరినప్పుడు మనకి జన్మే ఉండదు.

లోకంలో అందరూ అది తెలుసుకునే ప్రయత్నం చేయకుండా తప్పదంటూ పెళ్లి చేసుకుంటారు, తప్పదంటూ పిల్లల్ని కంటారు. ఎన్నో బాధలు

వచ్చాయి అంటారు. జన్మన్నాక బాధ వుండదా? ఎన్నిటితో పోల్చుకున్నా బాధ తప్పదు. శంకరాచార్యుల వారు చెప్పినా మానవులు తప్పదంటూ ఈ బురదలోకే దిగుతున్నారు. మరి శంకరాచార్యుల వారు చెప్పిన రెండవ శ్లోకం గురించి తెలుసుకుందాం.

శ్లో॥ **న చ ప్రాణ సంజ్ఞో నవై పంచవాయుః**
**న వా సప్తధాతు ర్నవా పంచకోశః**
**న వాక్పాణి పాదౌ న చో పస్థ పాయూ**
**చిదానంద రూపః శివోహం శివోహం ॥**

తాత్పర్యం:- ప్రాణము, అపానము, ఉదానము, వ్యానము, సమానము అనే పంచవాయువులు అంటే పంచప్రాణాలు నేను కాను. అలాగే స్థూల దేహానికి కారణమైన రసము, రక్తము, మాంసము, మేధస్సు, ఎముక, మజ్జ, శుక్ల సోణితాలు ఇలాంటి ఈ సప్తధాతువులు అంటే ఏడు ధాతువులు నేను కాను. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ పంచకోశాలు నేను కాను. అంతేకాదు కర్మేంద్రియాలైనటువంటి చేతులు, కాళ్ళు, వాక్కు, మల ద్వారం, మూత్ర ద్వారం నేను కాదు. చిదానంద రూపుడునగు శివుడనే నేను, శివుడనే నేను అని చెప్పారు.

ఇది మీకు బాగా గుర్తుంటే వీటి మీద మమకారం ఉండదు. వీటి గురించి జీవితాన్ని వృథా చేసుకోరు. విచిత్రం ఏమిటంటే తప్పదూ, తప్పదూ అంటూ అందులో కూరుకుపోతుంటారు. తప్పదు అనుకోవడం ఎందుకు? అందులో కూరుకుపోయి కూరుకుపోయాను అనుకోవడం ఎందుకు?

అలాగే చాలామంది ఈ పంచ ప్రాణాలే ఆత్మ అని అనుకుంటారు. ఆత్మ వేరు, పంచ ప్రాణాలు వేరు. శరీరంలో ఉన్నటువంటి ఐదు రకాలైనటు వంటి వాయు సంచారాలనే పంచప్రాణాలు అంటారు. మరి శరీరంలో ఆత్మ ఉన్నంత సేపే, ఆత్మ శక్తి ఉన్నంత సేపే ఈ వాయు సంచారం జరుగుతుంది.

అంటే ఈ పంచప్రాణాలు శరీరంలో ఉంటాయి. మరి అందుకే ఆత్మ నిష్క్రమిస్తే ఈ పంచ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి అంటారు. గాలిలో కలిసిపోతాయని ఎందుకు అంటారు? అంటే గాలి గాలిలో కలవకపోతే ఇంక దేంట్లో కలుస్తుంది!

ఎవరైనా చనిపోతే ప్రాణం పోయింది అని ఒక మాట అంటారు. ఆ మాట అనవాయితీ అయిపోయింది. ప్రాణం పోయింది అంటే ప్రాణమే ఆత్మ అనేటువంటి అభిప్రాయం చాలా మందిలో ఉంది. కానీ పంచప్రాణాలు వేరు, ఆత్మ వేరు. ఆత్మకి, ఈ పంచ ప్రాణాలకి సంబంధం లేదు. ఇక్కడ శంకరాచార్యుల వారు స్పష్టంగా ఈ పంచ వాయువులు నేను కాను అని చెప్పారు!

ఇంకా ఏమన్నారంటే ఈ స్థూల దేహానికి కారణమైనటువంటి సప్త ధాతువులు నేను కాను. ఇంకా పంచకోశాలు నేను కాను. పంచకోశాలు అంటే ఆత్మ పైన ఉండేటటువంటి ఐదు రకాల తొడుగులు.

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనే పంచకోశాలు కూడా నేను కాదు అన్నారు.

చాలామంది చనిపోయినప్పుడు మనం శరీరం వదిలేస్తాము, ఆత్మ పైకి వెళ్ళిపోతుంది అనుకుంటారు. కానీ మొట్టమొదట వదిలేసేది భౌతిక శరీరం, తర్వాత మూడు రోజుల్లో రాలిపోయేది ప్రాణమయ శరీరం, తర్వాత ఉండే మూడు శరీరాలతో అంటే మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనే మూడు కోశాలతో ఆత్మ పైలోకాలకి వెళ్తుంది.

ఇవన్ని సూక్ష్మ శరీరాలు కనిపించవు. నన్ను చాలామంది అడిగారు. మరి ఇక్కడ మనం చేసింది మళ్ళీ మనమే అనుభవిస్తామంటారు కదా? ఆత్మకి ఇంకేమీ వుండవు కదా? అన్ని ఆత్మలూ ఒకటే అయితే వారు చేసిన కర్మలు వారికే వెళ్తాయి అని ఎలా తెలుస్తుంది? అని అడుగుతారు.

అన్ని ఆత్మలు ఒకటే కానీ ఆత్మ పైన ఉండేటువంటి ఆ తొడుగుల

వల్ల గుర్తుపట్టగలరు. కొన్నాళ్ళు అక్కడ ఆ భువర్ లోకంలోనో, సువర్ లోకంలోనో ఉన్న తర్వాత ఈ మనోమయ కోశాన్ని వదిలేస్తారు. మొత్తం మీద ఆత్మ పైన ఈ కోశాలు ఉంటాయి. అందుచేత ఎవరు చేసిన కర్మలు వాళ్ళ ఖాతాలో రికార్డు అవుతాయి. వాడు చేసిన పాపాలు నాకు వచ్చేస్తే! నేను చేసిన పుణ్యాలు వాళ్ళకి వెళ్ళిపోతే! అని మీరేం వర్రీ పడనక్కర్లేదు. పైన అలాంటి ఇబ్బందులు ఏమీ ఉండవు.

మీరు మంచి చేస్తే ఆ మంచి మీకే ఉంటుంది. మీరు చెడు చేస్తే ఆ చెడు మీకే ఉంటుంది. అందుచేత మీరు చేసినవే మీ అకౌంట్ లో ఉంటాయి. వాటిలో నుంచే మళ్లీ కొన్ని ఎంచుకుని జన్మ తీసుకుంటారు. జన్మ తీసుకున్నప్పుడు మళ్లీ ఈ తొడుగులు తొడుక్కుని భూమి మీదకి వచ్చి తల్లి గర్భంలో ఉండే శరీరంలో ప్రవేశిస్తారు. భౌతిక శరీరం తల్లి తయారు చేస్తుంది. అలా జన్మ తీసుకుంటారు. ఇక్కడ భౌతిక శరీరమే కనిపిస్తుంది కానీ మిగతా శరీరాలు కనిపించవు. అందుచేత సహజంగా అందరూ ఇంకేమీ లేవేమో అనుకుంటారు.

కానీ పత్రిగారు భౌతిక శరీరం కాకుండా ఇంకా ఆరు శరీరాలు ఉన్నాయని చెప్తారు. కానీ శంకరాచార్యుల వారు ఈ కారణ శరీరం, మహాకారణ శరీరం ఇంతమట్టుకే చెప్పారు. మహాకారణ శరీరంలో భాగాలివి. మహాకారణ శరీరంలో ఆ నిర్వాణమయ శరీరం స్థాయికి వెళ్తే ఇంక ఐడెంటిటీ ఉండదు. కానీ అది కూడా వదిలేసిన తర్వాతే మోక్షాన్ని పొందేది, జన్మలేని స్థితి సాధించేది.

అదే మనకి తులసీదళం-1 పుస్తకంలో పంచ వింశతి అనే టాపిక్‌లో పత్రి గారు చెప్పారు. తులసి దళం అన్నది సామాన్యమైన పుస్తకం కాదు అద్భుతమైన జ్ఞానాన్ని ఇవ్వగలిగే పుస్తకం. అందుకే పత్రి గారు అన్నారు మీరు జ్ఞానవంతులు అయితేనే ఇంకొక జ్ఞాని అర్థమవుతాడు. నువ్వు డిగ్రీలోకి వస్తేనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టూడెంట్ అర్థమవుతాడు. నువ్వు ఐదవ క్లాసులో

ఉంటే పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టూడెంట్ ఎలా అర్థమవుతాడు? నువ్వు పోస్ట్ గ్రాడ్యుయేషన్ లోకి వస్తేనే పి. హెచ్.డి వాడు నీకు అర్థమవుతాడు, ఇదీ అంతే.

అందుచేత ఇవి ఏమీ నేను కాదు అని మీరు తెలుసుకోవాలి. ఇవన్నీ ఇప్పుడు ఉన్నాయి. కొన్నాళ్ళకి ఇవన్నీ పోతాయి. పోయేవి నువ్వు ఎలా అవుతావు? శాశ్వతమైనటువంటి ఆ శివుడవు అంటే ఆ పరబ్రహ్మావు నువ్వే. వీటితో నీకు సంబంధం లేదు. ఇది అర్థం చేసుకున్నవాడు వీటికి తక్కువ ప్రాముఖ్యమిస్తాడు. తనకే అంటే ఆత్మకే ప్రాముఖ్యం ఇస్తాడు. అలా ఇచ్చిన వాళ్ళు చివరి జన్మకు వచ్చినట్టే.

నువ్వు తప్పదు తప్పదు అనుకుంటే ఇంకా కొన్ని జన్మలు తీసుకుంటావు. ఎవడేం చేస్తాడు, నీకు అదే బాగుంటే అదే తీసుకుంటావ్. పత్రిగారు కూడా చెప్పారు ఏం కంగారు లేదు. నీకు తృప్తి తీరకపోతే ఎన్ని జన్మలైనా తీసుకో తప్పేం లేదు, శుభ్రంగా అనుభవించు, ఎంజాయ్ చెయ్యి. భూమి మీద ఉన్న నవరసాలన్నీ అనుభవించు.

ఆ సరదాలన్నీ తీరిపోయాక, ఇందులో ఏమీ లేదు అని అనిపించిన తర్వాత అప్పుడు దీంట్లోకి నువ్వే వస్తావు. ఒక రకంగా చెప్పాలంటే మీరందరూ ఆ స్థాయికి వచ్చిన వాళ్లే, అందుకే ఇందులోకి వచ్చారు.

కానీ తప్పట్లేదు అంటే ఉండాలని ఉంది, తప్పింది అంటే ఉండాలని లేదు. ఉండాలని ఉన్నవాడికి మోక్షం రాదు, ఇక ఉండాలని లేని వాడికే మోక్షం వస్తుంది. దాన్నే ముముక్షత్వం అంటారు.

శంకరాచార్యుల వారికి తల్లి చెప్పింది. ఒరేయ్ నాయనా! పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని, హాయిగా ఉండొచ్చు కదా? ఎందుకురా ఈ తిప్పలు అని. అప్పుడు ఆయన నాకేమీ అక్కర్లేదమ్మ, నాకు వీటి అవసరం లేదు, వాటికోసం నేను భూమి మీదకి రాలేదు అని అన్నాడు. మరి ఎంతో మందికాయన జ్ఞానాన్ని అందించాడు.

తప్పట్లేదు అన్న వాళ్ళంతా పెళ్ళి చేసుకుంటారు. కానీ తర్వాత కష్టాలు వచ్చినప్పుడు ఏంటో దేవుడికి నా మీద దయ లేదు. చిన్న చూపు చూసి ఎన్ని కష్టాలు పెడుతున్నాడో అంటారు. ఇంకా ఇలాంటి పెళ్లాన్నిచ్చాడు, మొగుడిని ఇచ్చాడు అంటారు. చేసుకోవడం బాగానే చేసేసుకుంటారు తప్పట్లేదని. తర్వాత దేవుడి మీదకి గెంటుతారు. అంటే చేసుకునేదాక బెల్లం, చేసుకున్నాక అల్లం. నువ్వు నాకు అక్కర్లేదు వెళ్ళిపో అంటారు. అదే ఆడవాళ్ళైతే నేను నీ దగ్గర ఉండను పుట్టింటికి వెళ్ళిపోతాను అంటారు.

అందుచేత శంకరాచార్యుల వారు ఏం చెప్పారంటే బాబు ఇవి ఏమి నువ్వు కాదు, చిదానంద స్వరూపుడవైనటువంటి ఆ పరబ్రహ్మవే నువ్వు. ఇది అర్థం చేసుకో, ఇవన్నీ నువ్వు అనుకుంటూ వీటిలో కూరుకుపోతున్నావు, అసలు వీటితో నీకు ఏ సంబంధం లేదు అని చెప్తున్నాడు.

# శంకరాచార్యుల వారు చెప్పిన మూడవ శ్లోకం

మానవుని శరీరంలో ఏవేవి బ్రహ్మము కాదో ఆరు శ్లోకాల్లో ఆయన వివరించడం జరిగింది. వాటినే 'నిర్వాణ షట్కం' అన్నారు. మనం అందులో ఇప్పుడు మూడవ శ్లోకం చెప్పుకుందాం

**శ్లో॥ న మే ద్వేషరాగౌ న మే లోభ మోహౌ**
**మదో నైవ మే నైవ మాత్సర్య భావః**
**న ధర్మో న చార్థో న కామో న మోక్షః**
**చిదానంద రూపః శ్శివోహం శ్శివోహం ॥**

తాత్పర్యం:-

రాగద్వేషములు కాని, లోభ మోహములు కాని నేను కాను. మదమాత్సర్యములు నేను కాను. ఇవి పాంచభౌతిక అంతఃకరణములకు సంబంధించినవి. నేను సర్వాత్మకుడను, నిత్యముక్తుడను. కావున నాకు పురుషార్థములనబడు ధర్మము, అర్థము, కామము, మోక్షములనేవి లేనే లేవు. చిదానందరూపుడగు శివుడనే నేను, శివుడనే నేను.

ఇక్కడ రాగద్వేషాలు గాని, లోభ మోహాలు కానీ, నేను కాను అన్నారు. ఇప్పుడు చూడండి మానవులకు సహజంగా ఈ రాగద్వేషాలు, లోభ మోహాలు ఉంటాయి. రాగము అంటే అనురాగం. తన వారి పట్ల అనురాగము, తన వారు కాని వారి పట్ల ద్వేషం అంటే ఇతరుల పట్ల ద్వేషం. తన మతం పట్ల అనురాగము ఇతర మతాల పట్ల ద్వేషము. తన కులం పట్ల అనురాగము, ఇతర కులాల పట్ల ద్వేషము. తన దేశం పట్ల అనురాగము, ఇతర దేశాల పట్ల ద్వేషము ఉంటుంది.

ఈ రకమైన రాగద్వేషాలు ఎవరిలో ఉంటాయో వారు నేను బ్రహ్మము అని తెలుసుకోలేదని లెక్క. వీటిల్లో మీరు ఏవి ప్రదర్శిస్తున్నా నేను బ్రహ్మము అంటే నేను ఆత్మను అన్న స్థితికి రాలేదనే లెక్క. చాలామంది ఆత్మస్థితికి రావడం అంటే ఏమిటి? ఆత్మగా జీవించడం అంటే ఏమిటి? అని అడుగుతారు.

మీరు ఒక్కసారి ఈ నిర్వాణ షట్కంలో ఆరు శ్లోకాలు చదివి ఈ ఆరు శ్లోకాలలో శంకరాచార్యుల వారు బోధించినట్టుగా, ఆయన చెప్పినవి ఏవీ నేను కాదు అన్నట్టుగా మీరు జీవిస్తే, ఆ లక్షణాలు మీలో లేకపోతే మీరు ఆత్మగా జీవిస్తున్నట్టే! ఆత్మ స్థితిలో ఉన్నట్టే! మీరు బ్రహ్మంగా ఎదిగినట్టే!

ఎన్నాళ్ళు ధ్యానం చేసినా, ఎంత జ్ఞానం పొందినా ఇంకా ఈ రకమైన లక్షణాలు మీలో ఉంటే మీరు ఆ స్థితికి ఎదగనట్టే. మీరు ఇంకా నేను ఆత్మని, అంటే నేను బ్రహ్మన్ని, నేను శివుడను అని తెలుసుకోలేదనే లెక్క, ఆ అవగాహనకి రాలేదు అని లెక్క. కాబట్టి మీ సాధన, మీ జ్ఞానం ఇంకా పెంచుకోవాలి.

చాలామంది ఏవో కొన్ని అనుభవాలు వస్తే ఎంతో ఎదిగిపోయాను అనుకుంటారు. కళ్ళు మూసుకున్నప్పుడు ఒక చెట్టో, పుట్టో కనబడితే వెంటనే నాకు థర్డ్ఐ ఆక్టివేట్ అయిపోయింది అని అందరికీ చెప్పేస్తారు. ఈ పిచ్చి జనం కూడా వాడు థర్డ్ఐ మాస్టర్ అని వాడికి బిరుదు ఇచ్చేస్తారు.

ఎవరైనా మీరు ఎంత ఎదిగిపోయారండి! రోజూ ఎన్ని గంటలు ధ్యానం చేసేవారండి? అని ఆవిడ దగ్గరికి వెళ్లి అడిగితే థర్డ్ ఐ మాస్టర్ అయిపోయినట్టు ఆవిడ ఇంక ఫోజులు కొట్టడం మొదలు పెడుతుంది. ఆవిడలో ఈ లక్షణాలు ఏమైనా వచ్చాయా అని చూసుకోదు.

ఇక్కడ థర్డ్ఐ యాక్టివేట్ అయితే మట్టుకు ఇతరులకు ఎందుకు చెప్పాలి? చెప్పిందంటే నాకే వచ్చింది అనే గర్వం ప్రదర్శించింది, ఎవ్వరికీ రాలేదు అనే గర్వంతో చెప్పింది. నిజంగా థర్డ్ ఐ వచ్చినా అలా బహిర్గతం చేయకుండా ఎవరైతే ఉంటారో వాళ్ళల్లో గర్వం లేనట్టు. గుర్తుపెట్టుకోండి గత జన్మలు చూసుకున్నారు. చెప్పాల్సిన పనేంటి? ఇతరులకు చెప్పినంత మాత్రాన ఈవిడకి కలిసొచ్చేదేమిటి?

అలా చెప్పడం వల్ల ఇతరులకి వచ్చే లాభమేంటి? ఆలోచించండి?

ఒకవేళ వస్తే దానిని ఉపయోగించి జ్ఞానాన్ని పెంచుకోవాలి. థర్డ్ఐ అంటే నువ్వు ఉన్నచోటే కూర్చుని సృష్టిలో ఉన్నటువంటి ఎన్నో లోకాలు

చూడవచ్చు, ఎంతోమందిని చూడొచ్చు, ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. మామూలు కళ్ళకు తెలియనటువంటి ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు. అది సంపాదించుకో! చెప్పుకోవడం వల్ల ఉపయోగం లేదు. దీన్నే గర్వము అంటారు.

ఒకవేళ ఎవరికైనా వచ్చి, నీకు రాకపోతే అసూయపడ్డావంటే ఇంకా నువ్వు ఎదగనట్టే లెక్క. ఎవరికి ఉంటే నీకెందుకు? వాళ్ళకి డబ్బుంటే నీకెందుకు? అవార్డులు వస్తే నీకెందుకు? వాళ్ళు మేడ కట్టుకుంటే నీకెందుకు? కారు కొనుక్కుంటే నీకెందుకు? వాళ్ళతో నీకేంటి సంబంధం? నువ్వు బ్రహ్మానివి, సమస్తమూ నీవే! ఈ సృష్టిలో నువ్వు కానిదంటూ ఏదీ లేదు. అన్నీ నీనుంచే ఉద్భవించాయి. వాళ్ళకుంది నాకు లేవు అనే భావంలో ఉన్నావు అంటే ఇంకా ఏమీ ఎదగలేదు. ఆత్మస్థితిలో లేవు, దేహ స్థితిలో ఉన్నావు.

మరి లోభం ఉంటే దేనికి ఖర్చు పెట్టవు, జ్ఞానం పెంచే పుస్తకాలు కొనడానికి కక్కుర్తి, ఎవరికైనా ఏదైనా ఇవ్వడానికి కక్కుర్తి. మోహం అంటే వ్యామోహం. దాని మీద వ్యామోహం, దీని మీద వ్యామోహం, అన్నిటి మీద వ్యామోహమే, ఏది చూస్తే అది పొందాలనే వ్యామోహం. ఇటువంటి లక్షణాలు నీలో ఉంటే ఇంకా ఆత్మస్థితిలోకి రాలేదు అని తెలుసుకోవాలి. నేను బ్రహ్మము అన్న విషయము ఇంకా నీకు అవగాహన కలగలేదు అని అర్థం.

నిర్వాణషట్కమ్‌లో శంకరాచార్యులవారు చెప్పిన దాంట్లో కనీసం ఒక్కటైనా ఆచరిస్తున్నామా? మరి అన్ని లక్షణాలు మీలో ఉంటే మీరు ఆత్మగా ఎక్కడ ఎదిగినట్టు? ఇంకా దేహంగా ఉన్నట్టే. ఇంకా ఎన్ని జన్మలు పడతుందో!

అందుచేత ఇవన్నీ నీకు సంబంధించినవి కాదు నువ్వు బ్రహ్మానివి. ఇవి పాంచభౌతిక అంతఃకరణములకు సంబంధించినవి అని శంకరాచార్యుల వారు చెప్పారు. పంచభూతాలకు సంబంధించిన ఈ శరీరం యొక్క అంతఃకరణం అంటే మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం వీటికి సంబంధించినవే ఇవన్నీ, అంతకన్నా ఇంకేమీ కావు.

శరీరం వదిలేస్తే ఇవన్నీ గాలిలో కలిసిపోతాయి. ఏవీ ఉండవు. అవన్నీ నువ్వు ప్రదర్శిస్తున్నావు. నువ్వు ఆత్మస్థితికి ఇంకా ఎక్కడ ఎదిగావు? ఆత్మగా ఎక్కడ జీవిస్తున్నావు? అవన్నీ నేను కాదు, నేను సర్వాత్మకుడను, సర్వత్రా వ్యాపించి ఉన్న ఆత్మనే నేను. నిత్య ముక్తుడను అంటే నాకు ముక్తేమీ అవసరం లేదు.

ఇవన్నీ నువ్వు అనుకున్నప్పుడు, ఇవన్నీ నువ్వు ప్రదర్శిస్తూ ఉంటే నీకు ముక్తి కావాలి. వీటితో నాకు సంబంధం లేదు అనే స్థితికి నువ్వు వచ్చినప్పుడు ఇంక నీకు ముక్తి ఎందుకు?

ఆత్మైన నీకు ముక్తేంటి? నిత్య ముక్తుడివే. అది తెలుసుకోలేక నాకన్నీ కష్టాలు, నాకన్నీ బాధలు, నాకన్నీ సమస్యలు, నాకన్నీ గొడవలు అని దుఃఖపడుతున్నావు.

అలాగే పురుషార్ధములు అనబడే ధర్మము, అర్ధము, కామము, మోక్షము అవి నాకు లేనే లేవు. వాటితో నాకు సంబంధం లేదు. నేను చిదానంద రూపుడనగు శివుడను, బ్రహ్మాన్ని, ఆత్మను.

అందుచేత ఎప్పుడూ ఆనందంగా వుండేవాడివి దుఃఖ పడే వాడిని కాదు. దుఃఖంలో కూడా ఆనందంగా ఉండే వాడిని అనే స్థితికి చేరుకోవాలి. బ్రహ్మమైన నీకు దుఃఖమేమిటి? వీటన్నటితోటి నీకు సంబంధం ఏమిటి? ఇవన్నీ నావనుకుంటూ, వీళ్లంతా నా వాళ్ళు అనుకుంటూ దుఃఖపడుతున్నావు అసలు వీటితో నీకు సంబంధమే లేదు.

ఏ శరీరం కోసం అయితే ఇంత తపన పడుతున్నావో, తాపత్రయ పడుతున్నావో ఆ శరీరమే నువ్వు కాదు. శరీరానికి సంబంధించిన మనసు బుద్ధి చిత్తము అహంకారము ఏవీ నువ్వు కాదు. రాగద్వేషాలు, లోభ మోహాలు, మద మాత్సర్యాలు ఏవీ నీకు సంబంధం లేదు. కానీ ప్రదర్శిస్తున్నావు అంటే నీకు ఇంకా తెలియలేదు. కానీ ఆ స్థాయికి రావాలి అప్పుడు నీవు ఎదిగినట్టు.

అందుచేత శంకరాచార్యుల వారు చెప్పినటువంటి ఈ విషయాలన్నీ మీరు అవగాహన చేసుకుంటే మీరు ఏ స్థాయిలో ఉన్నారో మీకు అర్ధమవుతుంది.

# శంకరాచార్యుల వారు చెప్పిన నాల్గవ శ్లోకం

**శ్లో॥ న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం**
**న మంత్రో న తీర్థం న వేదో న యజ్ఞః**
**అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా**
**చిదానంద రూపః శివోహం శివోహం॥**

తాత్పర్యం:

పుణ్యం కానీ, పాపము కానీ నేను కాను. సుఖము కానీ, దుఃఖము కానీ నేను కాను. మంత్రము కానీ, పుణ్యక్షేత్రము కానీ నేను కాను. వేదములు కానీ, వేద విహితములగు యజ్ఞములు కానీ నేను కాను. భుజించే పదార్థము కానీ, భుజించుట అనే క్రియ కానీ, భుజించువాడను కానీ నేను కాను. చిదానంద స్వరూపుడనగు శివుడను నేను, శివుడను నేను.

ఇక్కడ చూడండి చాలామంది పాపాలు చేస్తారు, కొంతమంది పుణ్యాలు చేస్తారు. కానీ ఇది ఆ బ్రహ్మానికి సంబంధం లేదు. అంటే ఆత్మకు సంబంధం లేదు. మనకి పాపం చేస్తే దుఃఖం వస్తుంది, పుణ్యం చేస్తే భోగం వస్తుంది. అంటే మానవుడు అనుభవించే దుఃఖం కానీ భోగం కానీ ఆత్మకు సంబంధం లేదు. నువ్వు ఎంత దుఃఖం అనుభవించు అవి ఆయన కాదు.

అందుకే గీతలో కానీ, పత్రి గారు కానీ ఏమని చెప్తారంటే? పాప కర్మలు కానీ, పుణ్య కర్మలు కానీ నీకు అవసరం లేదు అంటారు. వాటిని వదిలి ఆత్మ కర్మలు చేయమంటారు. అవే మోక్షాన్ని ఇస్తాయి, అంటే ఆ బ్రహ్మ స్థితికి తీసుకు వెళ్తాయి. మోక్షము అంటే దేహ స్థితి నుంచి మనోస్థితి నుంచి బుద్ధి స్థితి నుంచి దాటి ఆత్మ స్థితి అంటే బ్రహ్మ స్థితికి చేరుకోగలుగుతారు. అదే మోక్షం. అప్పుడే బ్రహ్మంగా విరాజిల్లుతారు. నేనే బ్రహ్మన్ని అన్న స్థితిలో ఉంటారు.

ఇవేమి ఆత్మకు సంబంధం లేదు. ఈ దేహంతో చేసే పుణ్యం కానీ,

పాపం కానీ అంతే కాదు సుఖం కానీ, దుఃఖం కానీ నేను కాను అన్నారు. భోగాలు సమకూర్చుకుని సుఖపడతారు. ఏసీల్లో ఉంటారు, కార్లో తిరుగుతూ ఉంటారు, ప్రతి పూటా షడ్రసోపేతమైన భోజనాలు చేస్తూ ఉంటారు, ఎన్నో సుందర దృశ్యాలు చూస్తూ ఉంటారు, మధురమైన సంగీతం వింటూ ఉంటారు, నేను సుఖపడుతున్నాను అని అనుకుంటూ ఉంటారు.

కానీ ఎప్పుడైతే  నేను బ్రహ్మాన్ని, నేను ఆత్మను అన్న స్థితికి వస్తారో ఇవేవి నాకు సంబంధం లేదు అన్న విషయం మీకు అర్థమవుతుంది. వాటి కోసం ఆరాడపడరు, వాటిని పొందాలనే ప్రయత్నం చేయరు, అవి లేవని బాధపడరు, ఉంటే అనుభవిస్తారు లేకపోతే లేవని అనుకోరు. ఇది మనం పత్రి గారి ద్వారా తెలుసుకోవచ్చు.

పత్రిగారు ఏమనేవారంటే ఉంటే అనుభవించు, లేకపోతే లేదని అనుకోవద్దు అంటారు. మరి ఆయన ఈ ఆనాపానసతి అంటే “శ్వాస మీద ధ్యాస” అందరికీ బోధించేటప్పుడు ఎన్నో ఊర్లు తిరిగారు. ఆయనకు ఉన్న ఉద్యోగాన్ని కూడా రాజీనామా చేశారు. ఆయనకు ఉన్న ఆధారం అదే. ఆయన చేతిలో డబ్బు ఉండేది కాదు, అలాగే జనరల్ కంపార్ట్మెంట్ లో వెళ్లి, బస్సుల్లో నిలబడి వెళ్లి, ఎన్నో ఊళ్ళు తిరిగేవారు.

ఆయన చెప్పేవారు ఒక్కో చోట నాకు టీ తాగాలని ఉండేది కానీ, డబ్బులు ఉండక తాగేవాడిని కాదు అనేవారు. అలాగే ఆయన చెప్పే ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానం ఎవరైతే ఆసక్తి చూపించేవారో వారికి బోధించడానికి ప్రయత్నించేవారు. ఆసక్తి లేని వారిని ఆయన పట్టించుకునేవారు కాదు, వదిలేసేవారు.

ఆ ఆసక్తి ఉన్నవాళ్ళ దగ్గర కొన్ని చోట్ల ధనం కూడా ఉండేది కాదు. ఇంట్లో వాళ్ళకే ఏ సౌకర్యాలు ఉండేవి కాదు. మరి ఈయనకెక్కడ సౌకర్యాలు ఇవ్వగలరు! అందుచేత అవి ఎలా ఉంటే అలాగే ఉండేవారు. పెద్ద పరుపులు లేకపోతే ఒక దుప్పటి వేసుకుని నేల మీదే పడుకునేవారు. ఆయన వాళ్ళు

ఏది ఇస్తే అదే తినేవారు.

మరి తర్వాత తర్వాత ఈ ధ్యానం యొక్క గొప్పతనం అర్థం చేసుకుని ఎంతో మంది ఈ మార్గంలోకి వచ్చారు. మెల్లి మెల్లిగా ఈ ధ్యానులు పెరిగే కొద్దీ ఆయనకి కొద్ది కొద్దిగా సౌకర్యాలు పెరగడం మొదలయ్యాయి. నేను 2002 నవంబర్ లో ఈ ధ్యానంలోకి రావడం జరిగింది. అప్పుడు ఆయనకి కారు లేదు, డ్రైవరు లేడు, కార్లో తిప్పేవారు లేరు, అయినా సరే బస్సుల్లోనే తిరిగేవారు. అప్పుడు ఆ పరిస్థితికి ఆయన ఏమీ ఫీల్ అయ్యేవారు కాదు.

వెళ్ళడం చూసుకునేవారు కానీ సౌకర్యాలు ఎలా ఉన్నాయి అన్న ఆలోచన ఆయనకు ఉండేది కాదు. కానీ ఆఖర్లో విమానాల్లో తిరిగారు. పెద్ద పెద్ద కార్లలో తిరిగారు. అందుకే ఉంటే అనుభవించు, లేకపోతే లేదని అనుకోకు అంటారు.

నువ్వు కనుక ఆత్మ స్థితిలోకి చేరుకుంటూ ఉంటే, ఆ అనుభూతి పొందుతూ ఉంటే వీటిని పట్టించుకోవు. శంకరాచార్యుల వారు చెప్పినట్టు బ్రహ్మ స్థితి అంటే నువ్వే బ్రహ్మంగా మారుతూ ఉన్న స్థితి. పుణ్యం కానీ, పాపం కానీ నీకు సంబంధం లేదు. సుఖం కానీ, దుఃఖం కానీ నేను కాను అని వాటి మీద దృష్టి పెట్టవు. ఉంటే ఉంటాయి లేకపోతే లేదు.

శంకరాచార్యుల వారు ఇంకా ఏమన్నారంటే మంత్రము కానీ, పుణ్యక్షేత్రము కానీ నేను కాను. కానీ కొంతమంది మంత్ర జపాలు చేస్తారు, ఇంకా కొంతమంది గురువుల దగ్గర మంత్రోపదేశాలు తీసుకుంటారు. కానీ అది బ్రహ్మానికి ఏం సంబంధం లేదు. అందుకే మంత్ర జపం వద్దు అంటారు పత్రిగారు. నువ్వు చేయవలసింది 'ఆనాపానసతి' అంటే "శ్వాస మీద ధ్యాస" మాత్రమే. ఈ మంత్రం నీకు సంబంధం లేదు అని శంకరాచార్యుల వారు చెప్పారు.

అలాగే చాలామంది ఆ భగవంతుని దర్శించాలని పుణ్యక్షేత్రాలకి వెళ్తారు. పుణ్యక్షేత్రం నేను కాదు అని శంకరాచర్యుల వారు అన్నారు. అక్కడ

స్నానాలు చేస్తారు, గుళ్ళల్లో దర్శనం చేసుకుంటారు కానీ అవి నేను కాదు అన్నారు.

అలాగే వేదాలు కానీ, వేదాలు కానటువంటి యజ్ఞాలు కానీ, నేను కాను అన్నారాయన. చాలామంది ఈ వేదాలు చాలా గొప్ప పుణ్యకర్మలు అని చెప్పి అనుకుంటారు. కానీ పుణ్యకర్మలు అయితే అయి ఉండొచ్చు కాని అవి కామ్య కర్మలు. కోరికలతో చేస్తారు. మరి ఆ పరబ్రహ్మకు కోరికలేముంటాయి? ఆయనకు లేనిది ఏంటి? సమస్తమూ ఆయనేగా, అన్నిటిని సృష్టించింది కూడా ఆయనే కదా! అందుచేత కోరికలతో చేసేవి ఏవి నాకు సంబంధం లేదు, నేను కాదు అన్నారు.

అలాగే భుజించే పదార్థము కానీ అంటే చాలామంది షడ్రసోపేతమైన ఆహారం భుజిస్తూ ఉంటారు. అది ఏ పదార్థమైనా అది నేను కాను అన్నారు. అందుకే రమణ మహర్షి వారు శరీరాన్ని నిలబెట్టుకోవడానికి ఏది ఉంటే అది తీసుకునేవారు అది కావాలి, ఇది కావాలి అనేది ఆయనకు ఉండేది కాదు. భుజించడం అనే క్రియ కానీ, దాన్ని భుజించువాడను కానీ నేను కాను అన్నారు. చిదానంద స్వరూపుడనగు శివుడనే నేను, శివుడనే నేను అన్నారు.

మనం గమనిస్తే లోకంలో భగవంతునికి నైవేద్యాలు పెడతారు. కానీ అవి భుజించే వాడను నేను కాను అని శంకరాచార్యుల వారు అన్నారు.

నేను బ్రహ్మాన్ని, ఆత్మను వేటితోనూ నాకు సంబంధం లేదు. చాలామంది ఒక ప్రశ్న వేస్తారు మరి శరీరంలోనే ఆత్మ ఉంది కదా! భగవంతుడు ఉన్నాడు అంటారు. మనం అనుభవించేవి ఏవీ ఆత్మకు సంబంధం ఉండదా? అంటారు. అవేమి ఆత్మకు సంబంధం లేదు, ఇవన్నీ నేను అనుకొని నువ్వు చేసేవే. నువ్వు మనసునే నేను అని అనుకుంటున్నావు, ఎందుచేతనంటే ఆ మనసే ఈ దేహాన్ని, ఇంద్రియాలన్నిటిని నడిపిస్తుంది. అందుచేత అన్నీ అనుభవించేది మనసే, చేయించేది మనసే, దుఃఖపడేది మనసే, సంతోషపడేది మనసే, ఏం చేసినా మనసే.

అందుచేత ఇవేమి ఆత్మకు సంబంధం లేదు. నువ్వు పాపం చేస్తావు. ఆ పాప ఫలితం నువ్వే అనుభవిస్తావు, అది ఆత్మకు సంబంధం లేదు. నువ్వు నరకం అనుభవిస్తూ ఉంటావు. ఆ నరకం ఆత్మకేం సంబంధం లేదు. నువ్వు నేను నేను అనుకుంటూ చేస్తూ ఉంటావు. నువ్వు "అసలు నేనుని" వదిలేసి, "కొసరు నేనుని" నేను అనుకుంటున్నావు. ఆ కొసరు నేనుకే ఇవన్నీ సంబంధం, అసలు నేను అంటే ఆత్మకు ఇవేమీ సంబంధం లేదు.

అందుచేత నీ జీవితంలో జరిగేవన్నిటిని ఆత్మ అంటే ఆ బ్రహ్మం సాక్షిభూతంగా గమనిస్తూ వుంటుంది. కానీ, వాటికి స్పందించడం కానీ, పట్టించుకోవడం కానీ, ప్రతిచర్యలు కానీ ఏమీ ఉండవు. చూస్తూ వుంటుంది అంతే. ఇది మీరు అర్థం చేసుకోవాలి.

ఆ స్థితికి మీరు చేరుకుంటే ఇవన్నీ నాకు సంబంధం లేదు అన్నది అర్థమవుతుంది. అప్పుడు ఈ ఆశా ఉండదు, ద్వేషం ఉండదు, క్రోధం ఉండదు, అసూయ ఉండదు, మమకారాలు ఉండవు. ఇలాంటివి ఏ మాత్రం ఉన్నా కూడా మీరు ఇంకా ఆత్మ స్థితికి అంటే బ్రహ్మ స్థితికి చేరుకోలేదనే లెక్క.

మీరు నిర్వాణ షట్కం అర్థం చేసుకుని ఆ స్థితిలో జీవించగలిగితే మీరు ఆత్మ స్థితిలో జీవిస్తున్నట్టే లెక్క. మరి ఉదయం నుంచి సాయంకాలం వరకు ఎన్నో చేస్తున్నారు, ఒక్కటి కూడా నేను కాదు అని చెప్తున్నారాయన. నేను అనుకుని చేస్తూ ఉంటే ఒక రకంగా ఉంటుంది. నేను కాదు అనుకుని చేస్తూ ఉంటే ఇంకొక రకంగా ఉంటుంది, అందుచేత మన సాధన ఆ స్థితికి రావాలి, అప్పుడే మీరు పరిపూర్ణులు అయ్యేది.

# శంకరాచార్యుల వారు చెప్పిన ఐదవ శ్లోకం

బ్రహ్మం యొక్క లక్షణాలు ఎన్నో రకాలుగా, ఎన్నో కోణాలలో నిర్వాణ షట్కమ్‌లో శంకరాచార్యులవారు వివరించడం జరిగింది. మరి అందులో 5వ శ్లోకం గురించి తెలుసుకుందాం.

**శ్లో॥ న మృత్యు ర్న శంకా న మే జాతి భేధః**
**పితో నైవ మే నైవ మాతా చ జన్మ ॥**
**న బంధు ర్న మిత్రం గురు ర్నైవ శిష్యః**
**చిదానంద రూపః శ్శివోహం శ్శివోహం ॥**

తాత్పర్యం:-

నాకు (ఆత్మకు) మరణము లేదు. భయము లేదు. స్త్రీ, పురుషుడు, నపుంసకులను జాతి భేదములు లేవు. నాకు పుట్టుక లేదు. కావున నాకు తల్లిగాని, తండ్రిగాని లేరు. నాకు బంధువు గాని, మిత్రుడు గాని, గురువు గాని, శిష్యుడు గాని లేరు. చిదానంద స్వరూపుడనగు శివుడను నేను, శివుడను నేను. అని ఈ శ్లోకంలో బ్రహ్మం గురించి వివరించారు.

మనమంతా కూడా ఆ బ్రహ్మ స్థితి పొందడానికి కృషి చేస్తున్నాం, కష్ట పడుతున్నాం, తీవ్ర సాధనలు చేస్తున్నాం. ఒకరకంగా అవసరాలకు తప్ప మిగిలిన సమయమంతా దీనికే కేటాయిస్తున్నాం. మరి ఇంత కష్టపడుతూ, ఇంత సాధన చేస్తూ, ఇంత జ్ఞానాన్ని పొందుతూ, ఏ స్థాయిలో ఉన్నాము? ఎంత ఎదిగాము? ఆత్మస్థితికి చేరుకోగలిగామా? లేదా? అన్నది తెలుసు కోవడానికే ఈ నిర్వాణ షట్కం. లేకపోతే ఏదో సాధన చేసి ఇన్ని సంవత్సరాల నుంచి చేస్తున్నాను, ఎదిగిపోయాను అనేటటువంటి భావం వుంటుంది.

ఈ శ్లోకంలో శంకరాచార్యులు వారు ఏం చెప్పారంటే? నాకు మరణము లేదు, భయము లేదు అన్నారు. ఆత్మ స్థితికి మీరు చేరుకుంటే మొట్టమొదట మీకు అర్థం కావాల్సింది ఇదే. నాకు మరణం లేదు అన్నది

ఎప్పుడైతే మీకు బాగా అర్థమవుతుందో చావుకు కూడా భయపడరు, చావుకి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు, చావు అంటే శరీరం వదలడమే అన్నది అర్థమవుతుంది.

ప్రకృతిలో ఉన్న ఏర్పాటు ఏమిటంటే ఈ ముసలిదైపోయిన శరీరాన్ని ఉపయోగించుకున్నంత కాలం ఉపయోగించుకున్నాక, ఉపయోగం లేని దాన్ని వదిలేస్తే మళ్ళీ కొత్త శరీరం వస్తుంది. మరలా అన్ని రకాల నైపుణ్యాలతో కొత్త శరీరాన్ని ఉపయోగించుకుంటారు. జ్ఞానాన్ని ఇంకా పెంచుకుంటారు. అందుచేత మరణం లాభమే కానీ నష్టమేమీ కాదు. మరి లాభం కలిగించే దానికి భయపడేదేముంది?

ఒకటే మీరు గుర్తుపెట్టుకోండి. మీరు దేహం అనుకుంటేనే మరణానికి భయ పడతారు. మీరు ఆత్మ అన్నది పూర్తిగా అవగాహన కలిగినప్పుడు ఈ మరణ భయం ఉండదు. అందుకే కృష్ణుడు కూడా చెప్పాడు. మరణించిన వారి గురించి గానీ, మరణించబోయే వారి గురించి గానీ ఎవరైతే దుఃఖించరో వారు పండితులు అంటే జ్ఞానంలో పూర్ణంగా పండిన వారు అని స్పష్టంగా చెప్పారాయన.

అందుచేత ఇది తెలుసుకోవాలి. అప్పుడు ఆ భయమే కాదు ఏ రకమైన భయమూ ఉండదు. జీవితంలో ఆస్తులు వచ్చినా, పోయినా, అనుకున్నది జరిగినా, జరగకపోయినా, చేసిన పనిలో విజయం సాధించినా, సాధించకపోయినా భయం ఉండదు. ఏం జరగాలో అది జరిగింది, దానికి భయపడేదేమిటి? జరుగుతున్న వాటితో నాకు సంబంధం లేదు. నేను చిదానంద రూపుడనగు శివుడను అంటే బ్రహ్మాన్ని, ఆత్మను అని తెలుసుకోవాలి.

అందుకే ఎప్పుడూ నేను దేహం కాదు ఆత్మ అని గుర్తు తెచ్చుకుంటే మీకు సగం దుఃఖం అక్కడే పోతుంది. లేకపోతే ప్రతిదానికి బాధ పడిపోతారు. అదెందుకు జరిగింది? ఇదెందుకు జరిగింది? దీనికి కారణం ఏమిటి? దానికి కారణం ఏమిటి? అంటూ చాలా దుఃఖపడుతూ ఉంటారు. అందుచేత ఏ

రకమైన భయమూ లేకుండా నిర్భయంగా జీవించగలిగితే మీరు ఆ స్థితికి చేరుకున్నట్టు లెక్క.

ఆత్మకు స్త్రీ, పురుషుడు, నపుంసకుడు అను జాతి బేధాలు లేవు. మీరు దేహపరంగా ఆలోచిస్తే ఈ బేధాలన్నీ కనిపిస్తాయి, ఆత్మ అని తెలుసుకుంటే, ఆత్మకిక స్త్రీ ఏముంది? పురుషుడేముంది? ఇవన్నీ భూమి మీదకి రావడానికి తీసుకున్న శరీరాలు తప్ప మీరు స్త్రీ కాదు, పురుషుడు కాదు, నపుంసకుడు కాదు. భూమి మీద మీ పని పూర్తి చేసుకుని మళ్ళీ శరీరం వదిలేస్తారు.

కొన్ని జన్మలు స్త్రీలుగా, కొన్ని జన్మలు పురుషులుగా, కొన్ని హిందువులుగా, కొన్ని ముస్లింలుగా, అలాగే రకరకాల కులాల్లో జన్మలు తీసుకుంటారు. ఇవన్నీ శారీరక సంబంధమైనవే కాని  ఆత్మైన మీకు సంబంధం లేదు.

అంతేకాదు ఇంకోటి తెలుసుకుంటారు. ఆత్మయిన నాకు పుట్టుక లేదు, చావు లేదు. మరి నాకు పుట్టుకే లేనప్పుడు తల్లి ఎక్కడుంటుంది? తండ్రి ఎక్కడుంటాడు? బంధువులు ఎక్కడుంటారు? మిత్రులు ఎక్కడుంటారు? అందుచేత దేహస్థితిలో ఉన్నంతకాలమే ఇవన్నీ ఉంటాయి. కాని ఎప్పుడైతే నేను ఆత్మ అన్న అవగాహన కలిగిందో ఇవన్నీ ఉండవు.

నాకు మిత్రులు గానీ, బంధువులు కానీ ఎవరూ లేరు. నాకు గురువు కానీ, శిష్యుడు గానీ లేరు అన్నారు. గురువు ఎవరూ లేరు అన్నదానికి ఒక చిన్న విషయం చెప్తాను. ఒక ఊళ్ళో ఒక గురువు దగ్గర కొంతమంది శిష్యులు విద్య అభ్యసిస్తున్నారు. అందులో ఒక శిష్యుడు ఏమన్నాడంటే కొన్నాళ్ళు నేర్చుకున్నాక అంటే ఒక రెండేళ్ళో, మూడేళ్ళో నేర్చుకున్నాక గురువు గారితో నేను వేదాలు, వేదాంగాలు మీ ద్వారా నేర్చుకున్నాను మీకు ధన్యవాదాలు.. నాకు సెలవిస్తే ఇక నేను వెళ్తానండి అన్నాడు.

ఎక్కడయ్యిందయ్యా? ఇంకా నేర్చుకోవాల్సింది  ఉంది అన్నారు.

మళ్ళీ ఇంకొక ఏడాది ఆ గురువుగారి దగ్గరే ఉండి ఇంకా ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అప్పుడు మళ్ళీ అవి నేర్చుకున్నాను, ఇవి నేర్చుకున్నాను ఇంక వెళ్ళొస్తానండి అంటాడు. అప్పుడా గురువుగారు అప్పుడే ఏమైంది? నువ్వు ఇంకా పూర్తిగా నేర్చుకోవాలి, ఇంకా కొన్నాళ్ళు నేర్చుకో అన్నాడు. మళ్ళీ అదే రకంగా ఒక ఏడాది ఉన్నాక, ఇంక నేర్చుకోవాల్సినవి ఏముంటాయి అని చెప్పి గురువుగారితోటి వెళ్లొస్తానన్నాడు. ఆయన మళ్ళీ సరిపోదు, నువ్వు నేర్చుకోవాల్సింది చాలా ఉంది అని చెప్పాడు.

మరల ఒక ఏడాది పోయిన తర్వాత ఆ శిష్యుడు ఏం చేశాడంటే! ఆ గురువుగారికి చెప్పకుండా వెళ్ళిపోయాడు. అప్పుడు గురువుగారికి అర్థమైంది. వీడు ఇప్పుడు పరిపూర్ణంగా తెలుసుకున్నాడు. సమస్తము నేనే, అంతా నేనే. నన్ను మించిందేది లేదు. ఇంక నేర్చుకోవాల్సింది కూడా ఏమీ లేదు అనే స్థాయికి వచ్చాడు కాబట్టి ఇంకా గురువుకి కూడా చెప్పాల్సిందేముంది అని చెప్పి, వాడు చెప్పకుండా వెళ్ళిపోయాడు.

అక్కడ మీరు ఆ స్థితికి చేరుకున్నప్పుడు మీకేమి అర్థమవుతుందంటే మనకి గురువూ ఉండడు, శిష్యుడూ ఉండడు. ఏవండీ బ్రహ్మానికి ఇంకొక గురువు ఉంటాడా? ఆలోచించండి. బ్రహ్మానికి తెలియనిదేముంది? పోనీలే శిష్యులు ఉండడానికి అందరూ ఆయనలోంచి వచ్చిన అంశలే కదా! ఆయనతో సమానమే కదా! ఆయన లాంటి వాళ్ళే కదా! మరి వాళ్ళు శిష్యులు ఎలా అవుతారు.

అందుచేతనే శంకరాచార్యులు వారు ఈ విషయం కూడా చెప్పడం జరిగింది. నాకు గురువు గానీ, శిష్యుడు గానీ లేరు. కారణం ఏమిటి అంటే? నేను చిదానంద స్వరూపుడనగు శివుడను అంటే బ్రహ్మాన్ని. ఆ స్థితికి వచ్చినప్పుడు వాళ్ళు పూర్ణాత్మ స్థాయికి ఎదిగినట్టు లెక్క, వాళ్ళకింక జన్మలు లేవు.

అందుచేత ఈ లక్షణాలన్నీ ఎవరిలో ఉంటాయో వారు పరిపూర్ణ స్థితికి చేరుకున్న వారు, ఎదిగిన వారు. మీరు ఇంకా మరణానికి భయపడుతూ

ఉంటే ఇంకా ఎదగాలి, దేనికి భయపడుతున్నా మీరు ఎదగాలి. ఆవిడ స్త్రీ, వీడు పురుషుడు, వాడు నపుంసకుడు అని ఇంకా ఇలాంటి భావాలు ఉంటే ఇంకా ఎదగలేదనే లెక్క.

ఈ శరీరం అన్నది జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇవ్వబడింది. అందుచేత ఆ శరీరమే నేననుకుంటూ దానికోసమే కృషి చేస్తూ, పాటుపడుతూ ఉంటే ఎంత అజ్ఞానంలో ఉన్నారో మనము ఆలోచించవచ్చు. ఈ శరీరము నేను అని భావిస్తేనే దుఃఖం. నాకు ఇలాంటి భర్త వచ్చాడు, ఇలాంటి పిల్లలు ఉన్నారు, లేకపోతే ఇలాంటి భార్య ఉంది, నాకు ఈ సమస్యలు ఉన్నాయి, ఇవన్నీ అంటున్నావంటే ఇంకా ఎదగలేదని లెక్క.

ఎవరైనా సరే ఆ స్థితికి ఎదగాలి, ఆ స్థితికి చేరుకోవాలి. ఇక్కడ ఈ రకమైన భావాలు కలగజేసేది మనసే. మనసు యొక్క ఉనికి ఉన్నంతకాలం ఎవరికైనా ఈ భావాలు ఉంటాయి. ఎప్పుడైతే మీరు తీవ్ర సాధన చేస్తూ ఉంటారో చివరికి ఈ మనసు శూన్యం అవుతూ ఉంటుంది. ఎప్పుడైతే మనసే లేదో ఇంక అక్కడ ఇవన్నీ ఆటోమేటిగ్గా అదృశ్యమైపోతాయి. అందుకే మనసుంటేనే మానవుడు. ఆ మనసు ఎప్పుడైతే శూన్యమైందో వాడే మాధవుడు.

ఆ స్థితికి ఎంత తొందరగా చేరుకుంటే మీకు అన్ని జన్మలు తగ్గుతాయి, అంత దుఃఖం పోతుంది. ఇంక సమస్యలూ ఉండవు, ఆ బాధలూ ఉండవు, మనసు ఉన్నంతవరకే ఇవన్నీ.

ధ్యానంలో మూడు స్థితులు ఉన్నాయి. ప్రాథమిక స్థితిలో చంచల మనసు నిశ్చలం అవుతుంది, రెండవ స్థితిలో నిశ్చలమైన మనసు నిర్మలమవుతుంది అంటే శుద్ధి అవుతుంది, ఇంకా అలా సాధన చేయగా చేయగా పరిశుద్ధి, మహా పరిశుద్ధి అవుతుంది, మనసు ప్రాముఖ్యం బాగా తగ్గిపోతుంది, ఇంకా మెల్లిమెల్లిగా సాధన కొనసాగించినట్లయితే ఈ పరిశుద్ధమైన మనసు శూన్యమవుతూ ఉంటుంది. అలా శూన్యమై, పరిశూన్యమై చివరికి మహా పరిశూన్యం అయిపోతుంది.

అప్పుడు ఎవరినైతే మీరు గొప్పవాళ్ళు, దేవుళ్ళు అనుకుంటున్నారో ఆ స్థితికి చేరుకుంటారు.

అందుచేత ఆ స్థితికి చేరుకునేదాకా తీవ్ర సాధన చేయాలి. ఇప్పుడు మీరు సంసారం లో ఉండి ఆ స్థితిని సాధించడానికే కృషి చేస్తున్నారు. అందుచేత అవసరాలు చూసుకుంటూ ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా పత్రి గారు చెప్పినట్టుగా సాధనకు, స్వాధ్యాయానికి, సాంగత్యానికి, సేవకి కేటాయిస్తూ ఆ స్థితి సాధించే ప్రయత్నం చేయాలి.

కనుక ఈ జన్మలో మీరు చేసే కృషిని బట్టి, మరుజన్మ ఆఖరి జన్మ చేసుకోగలిగే అవకాశం మీకు వస్తుంది. మీ కృషి ఇంకా ఎక్కువగా ఉంటే ఈ జన్మే ఆఖరి జన్మ అవ్వచ్చు కూడా! సంసారంలో ఉన్నంత మాత్రాన సాధ్యం కాదు అని ఏమీ లేదు. అందుచేత ఆహార నియమాలు పాటిస్తూ, తీవ్ర సాధన చేయాలి.

మరి రమణ మహర్షి అన్నీ వదిలేసి ఎక్కడో కూర్చుంటే పిచ్చోడనుకునే వారు అందరూ. అదేం జీవితం? అనుకునేవారు. చివరికి ఆయిన ఎంతో గొప్పవాడు అయ్యాడు!

మరి పత్రి గారు మనలాంటి వాళ్ళందరికీ ఈ జ్ఞానాన్ని, ఈ సత్యాన్ని తెలియబరచాలనే ప్రణాళికతో భూమి మీదకి వచ్చారు. అందుచేత ఊరూరు తిరిగి, ఎన్నో దేశాలు తిరిగి ఈ సత్యాన్ని అందించారు. అందుకే అంతా తెలుసుకోగలిగారు. ఒక్కొక్కళ్ళ ప్రణాళిక ఒక్కొక్క రకంగా ఉంటుంది.

మీరు ఇందులో లీనమయ్యే కొద్దీ తెలియకుండానే మీలో ఆసక్తి పెరుగుతుంది. మీలో మార్పులు వస్తాయి. అందరూ ఎప్పుడూ ఒకేలా ఉండరు! ఏ పని చేసుకుంటున్నా ఉండవలసింది ఆసక్తి అంతే.

# శంకరాచార్యుల వారు చెప్పిన ఆరవ శ్లోకం

బ్రహ్మం యొక్క లక్షణాలు ఎన్నో రకాలుగా, ఎన్నో కోణాలలో నిర్వాణ షట్కంలో శంకరాచార్యులవారు వివరించడం జరిగింది. మరి అందులో 6వ శ్లోకం గురించి తెలుసుకుందాం.

**శ్లో॥ అహం నిర్వికల్పో నిరాకార రూపో**
**విభుత్వాచ్ఛ సర్వత్ర సర్వేంద్రియాణామ్ ।**
**న చా సంగతం నైవ ముక్తి ర్న మేమః**
**చిదానంద రూపః శ్శివోహం శ్శివోహం ॥**

తాత్పర్యం:- నేను ఏ విధమైన విశేషములు లేని వాడను, నిరాకారుడను, వ్యాపకుడను, నేను సర్వదేశముల యందు, సర్వకాలముల యందు, సర్వ వస్తువుల యందు ఉండు వాడను. కావుననే నా స్వరూపము నిఖలేంద్రియము లకును సంగతమగుచునే యుండును. నేను ముక్తుడను కాను, భద్ధుడను కాను, నేను సంగము కలవాడిని కాను, నేను కేవలం జ్ఞానానందమైన ఆత్మను. చిదానంద స్వరూపుడనగు శివుడనే నేను, శివుడనే నేను.

నేను ఏ విధమైన విశేషములు లేనివాడను అంటే నాకు ఏ విధమైన ప్రత్యేకతలూ లేవు. నిరాకారుడను అంటే నాకు ఏ ఆకారం లేదు. నేను వ్యాపకుడను అంటే అంతటా వ్యాపించి ఉన్నవాడిని. నేను సర్వ దేశముల యందును అంటే అన్ని దేశములయందు, సర్వకాలములందు అంటే భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో, సర్వ వస్తువులయందు కూడా అంటే సృష్టిలో ఏమున్నాయో వాటన్నిటిలోనూ అంటే.. 84 లక్షల జీవులే కాదు, చరాలే కాదు, అచరాలే కాదు, అన్నిట్లోనూ ఉన్నాను నేను.

అందుచేత నా స్వరూపం నిఖిలేంద్రియములకు, అందరికీ అన్నిటికీ సంగతమగుచునే ఉండును అంటే తెలుస్తూనే ఉంటుంది. ఇక్కడ శంకరాచార్యుల

వారు బ్రహ్మం గురించి చెప్పడం కాదు. ఆయన నేను అనే పదం చెప్తున్నారు. ఇక్కడ మీరు గమనించండి. ఈ  దేహం నేను అనుకుంటున్నారు. కానీ, ఈ దేహం నేను కాదు. ఈ కులం నేను అనుకుంటున్నారు. ఈ ప్రాంతం నేను అనుకుంటున్నారు. ఈ మతం నేను అనుకుంటున్నారు. ఇవేవీ మీకు సంబంధం లేదు.

నీది ఒక ప్రాంతం కాదు, నువ్వు అంతటా ఉన్నావు. ఏదో ఒక జాతికి సంబంధించిన వాడివి కాదు, అన్నిటికీ సంబంధించిన వాడవు. ఒక మతానికి సంబంధించిన వాడవు కాదు, అన్ని మతాలు నీవే. పత్రి గారు కూడా అదే చెప్పారు.

ఇప్పుడు నేను హిందూ మతంలో బ్రాహ్మణుడిగా జన్మ తీసుకున్నాను అంటే బ్రహ్మమైన నేను బ్రాహ్మణ కుటుంబంలో శరీరం తీసుకున్నాను. నేను బ్రాహ్మణుడని అనుకుంటారు మీరు కానీ ఇంతకుముందు జన్మలో నేను ఒక ముస్లిమ్ సూఫీ మాస్టర్‌ని, హైదరాబాదులో నేను జన్మించాను. అంతకు ముందు అమెరికాలో ఒక క్రిస్టియన్ బెంజిమెన్ ఫ్రాంక్లిన్‌గా జన్మ తీసుకున్నాను. అంతకుముందు బుద్ధుడి దగ్గర ఆనందుడ్ని బౌద్ధుడిని. ఇప్పుడు నేను ఏ మతానికి చెందిన వాడినో? మీరే చెప్పండి అని అడిగారాయన.

అందుచేత ఏ మతము నాది కాదు. ఏ మతము నేను కాదు వాటితో నాకు సంబంధం లేదు. నేను ఆత్మను నేను బ్రహ్మాన్ని నేను సర్వ వస్తువుల యందు, సర్వ దేశములయందు, సర్వకాలాలలో కూడా ఉండేవాడిని. ఏదో ఒక హిందువుగా ఒక జన్మలో ఉండి, ముస్లింగా ఒక జన్మలో ఉండి, అలా ఉండేవాడిని కాదు నేను. ఎప్పుడూ ఉంటాను, అన్ని చోట్ల ఉంటాను, అంతటా ఉంటాను.

ఏవైతే మనం ఇప్పుడు అనుకుంటున్నామో అవేవీ నేను కాదు. ఇప్పుడు మీరు చూడండి ప్రపంచంలో ఏదో ఒక ప్రాంతంలో ఎన్నో యుద్ధాలు

జరుగుతూనే ఉన్నాయి. ఒకరి మీద ఒకరు బాంబులు వేసుకుంటున్నారు. టెక్నాలజీ పెరిగి రకరకాల పెద్ద పెద్ద ఆయుధాలన్నీ తయారు చేసుకుని ఒకళ్ళని ఒకళ్ళు నాశనం చేసుకుంటున్నారు. దీనికి ముఖ్య కారణం ఏమిటంటే? ఆ దేశం నాది కాదు, వాళ్లు వేరు, వీళ్ళు వేరు, వాళ్ళ మతం వేరు, నా మతం వేరు అని ద్వేషించుకుంటూ శత్రుత్వాన్ని పెంచుకుని ఇలా యుద్ధాలు చేసి ఎంతో నష్టపరుచుకుంటున్నారు.

ఎన్నో కోటానుకోట్లు ఖర్చు పెట్టి అభివృద్ధి చేసుకున్నటువంటి దేశాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. దీనికి ముఖ్య కారణం ఏమిటి అంటే శంకరాచార్యుల వారు చెప్పినటువంటి ఈ సత్యం తెలియకపోవడమే. అంతా ఒకటే ఇంతమంది లేరు, అసలు పరబ్రహ్మం తప్ప వేరొకటి లేదు, అన్నీ ఆయనలోని భాగాలే.

బంగారం వస్తువులు రకరకాలు ఉంటాయి, వాటికి రకరకాల పేర్లు, రకరకాల ఆకారాలు ఉంటాయి. వాటికి రకరకాల ఉపయోగాలు ఉంటాయి. కానీ అన్నీ బంగారం నుంచి వచ్చినవే. మళ్ళీ అన్ని రకాల వస్తువులు కరిగిస్తే బంగారం అయిపోతాయి. మరి అవి రకరకాల వస్తువులా అంటే కానే కాదు. అంతా బంగారం నుంచి వచ్చినవే.

అలాగే ఈ బ్రహ్మం నుంచే ఇన్ని రకాల జీవరాసులు, మానవులు, ఇంత ప్రపంచము, ఇన్ని దేశాలు ఏర్పడ్డాయి. కానీ చివరికి ఇవన్నీ అదృశ్యమై బ్రహ్మంలోనే కలిసిపోతాయి. మీరు ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి. ఏదైతే సృష్టింపబడిందో అది కొంత కాలమే ఉంటుంది, మళ్ళీ అదృశ్యమైపోతుంది. అదృశ్యం అవ్వకుండా ఉంటే అది ఉన్నట్టు లెక్క. కానీ అదృశ్యం అయిపోతుంది. ఎంతో మార్పు జరుగుతుంది. అంతా ఉంటారు అనే భావంతో ఈ ద్వేషాలు, ఈ కక్షలు, కార్పణ్యాలు, ఒకరినొకరు నాశనం చేసుకోవడం లాంటివి చేస్తున్నారు.

అందుకే పత్రి గారు ప్రతి ఒక్కరినీ జ్ఞానవంతులు కమ్మన్నారు. ఆ జ్ఞానం సంపాదించాలంటే “శ్వాస మీద ధ్యాస” ధ్యానం చేయాలి అని అన్నారు. ఆ జ్ఞానాన్నే ప్రపంచవ్యాప్తంగా అందరికీ బోధించారు. ప్రతి ఒక్కరినీ అజ్ఞానం తొలగించుకోమన్నారు. ఇతరులు వేరు అనుకోవడమే అజ్ఞానం. అంతా ఒకటే అనే స్థితికి రావడమే జ్ఞానం. ఇంకా మీలో ఏమాత్రం వేరు అనే భావం ఉన్నా మీరు అజ్ఞానంలో ఉన్నట్టే.

నష్టమేముందండి అజ్ఞానంలో ఉంటే! అంటారు. నష్టమేమీ లేదు. నువ్వు ఇంకా చాలా జన్మలు తీసుకుంటావు అంతే. తీసుకుంటే నష్టమేముంది? జన్మలు తీసుకుంటే నష్టమేమీ లేదు. కానీ ఏదైనా దుఃఖం వచ్చినా, కష్టం వచ్చినా, సమస్య వచ్చినా, బాధ పడతావు! ఎందుకు కష్టం వచ్చింది? నేను వేరు, ఆ కోడి వేరు, అవి నేను తినడానికే ఉన్నాయి అని తినడం వల్ల. దాని ఫలితంగా రోగాలు కష్టాలు తెచ్చుకుంటారు, తర్వాత బాధపడతారు. ఆ బాధ పడినప్పుడు ఎందుకొచ్చిన జీవితం అనుకుంటారు.

ఎవరైతే అన్నీ ఒకటే, అంతా ఒకటే అని తెలుసుకుంటారో, ఆ స్థితికి వస్తారో అన్నిటిని, అందరిని గౌరవిస్తారు. అందరితో స్నేహపూర్వకంగా, ఆనందంగా జీవించగలుగుతారు. చివరికి జ్ఞానం పొంది జన్మ లేని స్థితికి చేరుకుంటారు.

నువ్వు ఇప్పుడు కాదు, ఇంకో 50 జన్మలెత్తినా, ఇంకో రెండు వందల జన్మలు ఎత్తినా చివరికి సాధించవలసింది అదే, తెలుసుకోవలసింది అదే. ఏదైతే నేను నేను అనుకుంటున్నావో అది ఏదీ నేను కాదు అన్న విషయం తెలుసుకునే దాకా నువ్వు అలా జన్మలు తీసుకుంటూ, దుఃఖపడుతూ ఉండవలసిందే. అందుచేత ఇవేమీ నేను కాదు, నేను ఆత్మను, నేను శివుడను, నేను బ్రహ్మాన్ని అది తెలుసుకో అంటున్నారు శంకరాచార్యుల వారు.

అందుచేత ఈ నిర్వాణ షట్కాన్ని బట్టి ముక్త స్థితిని పొందిన వారు

ఏ రకమైన స్థితిలో ఉంటారంటే? నేను ఏ విధములైన విశేషములు లేని వాడను, నిరాకారుడను, సర్వవ్యాపకుడను సర్వకాల సర్వ వస్తువులయందు, సర్వదేశముల యందు ఉండు వాడనని తెలుసుకుంటాడు. నేను కేవలం జ్ఞానానందమయిన ఆత్మను, చిదానంద స్వరూపడనగు శివుడను. అంటే నేను బ్రహ్మాన్ని అని తెలుసుకుంటాడు. అలా తెలుసుకున్న వాడి ప్రవర్తన కూడా దానికి తగ్గట్టుగానే ఉంటుంది, మారిపోతుంది.

పత్రిగారు ఒక సందర్భంగా చెప్పారు. ఎవరిని చూసినా నేనే కదా అనే భావం మీలో ఏర్పడాలి. చూడడానికి వేరే గానే వుంటారు. కానీ ఆ భావం ఉండాలి. తానే ఇన్ని రూపాలలో ఉన్నానని తెలుసుకున్నవాడు ఎవరినీ అవమానించడు, ఎవరినీ నష్టపెట్టడు? ఎవరినీ కష్టపెట్టడు? ఎవరిని ఏమి చేసినా తనకి తాను చేసుకున్నట్టే కదా? అందుచేత అటువంటి పనులు ఏమీ చేయడు. అలాగే ఏ జంతువుని చంపినా, హింసించినా, భక్షించినా, తనని తాను హింసించుకున్నట్టే కదా? అందుచేత ఏ జంతువును, పక్షిని హింసించడు, చంపడు, భక్షించడు.

పైగా ప్రేమిస్తాడు, రక్షిస్తాడు, స్నేహం చేస్తాడు. అందరిని, అన్నిటిని తనతో సమానంగా చూసుకుంటాడు. ఇక్కడ ఒక సందేహం వస్తుంది. అంతా ఒకటే అయితే! అంతా నేనే అయితే! నా భార్యతో నన్ను కాపురం చేయ మంటారా? వద్దంటారా? అని అడుగుతారు. అలాగే కొంతమంది నా పని వాడితోటి పని చేయించుకోమంటారా? వద్దంటారా? అని కూడా అడుగుతారు.

మరి వశిష్టుల వారు ఏమి బోధించారంటే? కర్మలలో ద్వైతాన్ని, భావంలో అద్వైతాన్ని ఆశ్రయించాలంటారు. కర్మలలో ద్వైతాన్ని అంటే నువ్వు పనులు చేసేటప్పుడు వాడు నా భర్త, ఆవిడ నా భార్య అన్నట్టుగా కర్మలు చేయాలి. భార్య భార్యలా జీవిస్తూ, తన ధర్మాన్ని నిర్వర్తించాలి. భర్త భర్తలా జీవిస్తూ, తన ధర్మాన్ని నిర్వర్తించాలి. మానవుడు మానవుడి లాగే ఉండాలి.

నువ్వు పనివాడికి పని చెప్పడం మానేస్తే, వాడితో నేను పని చేయించుకోవడం ఏమిటి? అనుకుంటే వాడు ఎలా బ్రతుకుతాడు? ఆ అనుభవాలు ఎలా పొందుతాడు?ఆ పాఠాలు ఎలా నేర్చుకుంటాడు?


అందుచేత వాడు నేను ఒకటే అనే భావంతో వాడిని గౌరవిస్తూ, వాడిని ఏమీ బాధించకుండా వాడిని నీతో సమానంగా చూసుకుంటూ ఉండాలి. ఒకసారి నేను పత్రిగారి తోటి భూటాన్ వెళ్లాను. అక్కడ ఒక కొండ మీదకి ట్రెక్కింగ్ కి వెళ్ళాలి. అంటే నడిచేవారు నడవచ్చు, నడవని వాడు గుర్రమెక్కి వెళ్ళొచ్చు. గుర్రానికి ఇంత అని ఏదో ఇవ్వవలసి వస్తుంది. అప్పుడు నేను ఎక్కడ నడవగలను! ఈ కొండలన్నీ ఎక్కి ఎక్కడ దిగుతాను! ఎందుకు వచ్చిన గొడవ అని గుర్రం ఎక్కి వెళ్దాము అనుకున్నా. కానీ ఆ గుర్రం నేను ఒకటే కదా! దాని మీద ఎక్కి దాన్ని నేను ఎందుకు బాధ పెట్టాలి అని రూమ్ లోనే ఉండిపోయాను.

తర్వాత ఒక సందర్భంగా పత్రి గారు చెప్పారు నువ్వు దాన్ని ఎందుకు బాధ పెట్టడం అని ఎక్కడం మానేస్తే, ఆ గుర్రం వాడికి ఆ డబ్బు ఇవ్వకపోతే, దానికి వాడు తిండి ఎలా పెడతాడు? దాన్ని ఎలా పోషిస్తాడు? అందుచేత నీ ధర్మంగా నువ్వు ఇవ్వవలసింది ఇవ్వు. వాడు దాన్ని పోషిస్తాడు. ఆ గుర్రం దాని పని అది చేస్తుంది అని చెప్పారు. అప్పుడు అర్థమైంది.

అందుచేత దాన్ని ఎక్కు, దానికి వేళకి కావలసిన నీరు, ఆహారం, ఏది లోటు లేకుండా పెట్టు. దానికి పెట్టకుండా నీరసింప చేసి నువ్వు దాన్ని ఎంజాయ్ చేయాలి అంటే అది విరుద్ధం. అందుచేత భావంలో అద్వైతం, కర్మలలో ద్వైతం వుండాలి. కర్మ చేసేటప్పుడు భార్య భార్యే, భర్త భర్తే, పనివాడు పనివాడే, యజమాని యజమానే భావంలో ఇద్దరు సమానమే. భార్యను ప్రేమించు. ఆవిడకి ఏ లోటు లేకుండా చూడు. భర్తని ప్రేమించు, ఆయన పట్ల నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు. అది వశిష్టుల వారు చెప్పినటువంటి

విషయం.

అందుచేత ఎవరి ప్రవర్తనైతే శంకరాచార్యుల వారు బోధించిన విధంగా మారిపోతుందో వారు నిర్వాణ స్థితిలో ఉన్నట్టే. నిర్వాణాన్ని పొందినట్టే, వారిని జీవన్ముక్తుడు అని కూడా అంటారు. అందుచేత ముముక్షువులు అంటే ధ్యాన సాధన చేసేవారు తమ ప్రవర్తన పై విధంగా మార్పు చెందిందా? లేదా? అని చూసుకోవాలి. ఒకవేళ మార్పు కనపడకపోతే తాను చేసే సాధన సరిపోలేదని, సాధనలో ఎక్కడో లోపం ఉంది అని తెలుసుకోవాలి. ఆ లోపాన్ని సరిచేసుకుని సాధన కొనసాగించాలి. ఎవరైనా సరే చివరికి జీవిత లక్ష్యమైన నిర్వాణాన్ని సాధించాలి.



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**



# श्री तटवर्ती वीर राघवराव के हिन्दी किताब

1. आत्म शास्त्र ।........................................................ Rs.200/-
2. ध्यान विद्या ।........................................................ Rs.160/-
3. भगवद गीता का सार ।............................................ Rs.160/-
4. सत्य मार्ग ।........................................................... Rs.160/-
5. मरने से पहले मरना है। ............................................ Rs.130/-
6. गाईडिंग ध्यान क्यों नहीं ?........................................ Rs.120/-
7. भगवान कौन है।.................................................... Rs.120/-
8. कर्म सिद्धांत ।........................................................ Rs.120/-
9. विज्ञान का अर्थ – निहितार्थ ।................................... Rs.120/-
10. ब्रह्म ज्ञान ।........................................................ Rs.100/-
11. यह जीवन क्यों है ? .............................................. Rs.100/-
12. मेहर बाबा का संदेश ।.......................................... Rs.100/-
13. मरने के बाद, साथ में आने वाले विषयों ।..................Rs.80/-
14. भगवत के दृश्यों का अर्थ ।........................................Rs.80/-
15. आत्म हंतक कौन होता है ।........................................Rs.70/-
16. दुख निवारण का मार्ग..................................................Rs.75/-
17. उत्तम पुरूष...............................................................Rs.60/-
18. आर्थिक स्थिति बढाना है तो ? .................................Rs.60/-
19. निर्वाण मार्ग..............................................................Rs.60/-
20. सत्य.........................................................................Rs.50/-
21. क्या हम इस लोक के वासी हैं या परलोक के वासी हैं ? .......... Rs.50/-
22. गुरू को पहचानना कैसे ?.........................................Rs.50/-
23. विद्यार्थियों के विकास के लिए ध्यान विद्या ................Rs.50/-
24. शाकाहार ही मानव का आहार है! ..............................Rs.50/-
25. संकल्प अर्थात ?........................................................Rs.40/-

**For Books Contact : TATAVARTHY VEERA RAGHAVARAO**
**Tatavarthyvari Street, BHIMAVARAM-534201.**
**W.G.Dist., A.P. Ph: 94403 09812**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కర్మ సిద్ధాంతం - రూ.80/-
20) ధ్యానమంటే ? - రూ.80/-
21) త్రివిధాలు - రూ.80/-
22) ఉత్తమ పురుషుడు - రూ.80/-
23) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
24) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
25) జ్ఞాన జ్యోతి - రూ.70/-
26) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
27) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
28) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
29) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
30) బుద్ధుని సందేశాలు - రూ.70/-
31) భూతదయే దైవత్వం - రూ.70/-
32) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
33) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
34) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
35) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
36) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
37) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
38) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
39) అతీంద్రియ శక్తులు - రూ.60/-
40) ఆలోచించండి - రూ.60/-
41) నిర్వాణ మార్గం - రూ.60/-
42) ధ్యానులకు సూచనలు - రూ.60/-
43) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
44) సంకల్పమంటే? - రూ.50/-
45) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
46) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
47) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
48) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
49) బ్రహ్మం అంటే? -రూ.40/-
50) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
51) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
52) మహాత్ముల సందేశాలు - రూ.40/-
53) సత్యం - రూ.40/-
54) చక్రాలు - రూ.40/-
55) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
56) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
57) మౌన ధ్యానం - రూ.40/-
58) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
59) శాకాహారమే మానవాహారం - రూ.15/-
60) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



## శ్రీ శంకరాచార్యుల వారు

- మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అను వృత్తులతో కూడిన అంతఃకరణము నేను కాను. జ్ఞానేంద్రియాలు నేను కాదు. పంచభూతములు నేను కాదు.
- పంచవాయువులు అంటే పంచప్రాణాలు నేను కాను. సప్తధాతువులు అంటే ఏడు ధాతువులు నేను కాను. పంచకోశాలు నేను కాను. కర్మేంద్రియాలైనటువంటి చేతులు, కాళ్ళు, వాక్కు, మల ద్వారం, మూత్ర ద్వారం నేను కాదు.
- రాగద్వేషములు కాని, లోభ మోహములు కాని నేను కాను. మదమాత్సర్యములు నేను కాను. నేను సర్వాత్మకుడను, నిత్యముక్తుడను. కావున నాకు పురుషార్థములనబడు ధర్మము, అర్థము, కామము, మోక్షములనేవి లేనే లేవు.
- పుణ్యం కానీ, పాపము కానీ నేను కాను. సుఖము కానీ, దుఃఖము కానీ నేను కాను. మంత్రము కానీ, పుణ్యక్షేత్రము కానీ నేను కాను. వేదములు కానీ, వేద విహితములగు యజ్ఞములు కానీ నేను కాను.
- నాకు (ఆత్మకు) మరణము లేదు. భయము లేదు. స్త్రీ, పురుషుడు, నపుంసకులను జాతి భేదములు లేవు. నాకు పుట్టుక లేదు. తల్లిగాని, తండ్రిగాని లేరు. బంధువు గాని, మిత్రుడు గాని, గురువు గాని, శిష్యుడు గాని లేరు.
- ఏ విధమైన విశేషములు లేని వాడను, నిరాకారుడను, వ్యాపకుడను, నేను సర్వదేశముల యందు, సర్వకాలముల యందు, సర్వ వస్తువుల యందు ఉందు వాడను. నేను ముక్తుడను కాను, భద్ధుడను కాను, నేను సంగము కలవాడిని కాను, నేను కేవలం జ్ఞానానందమైన ఆత్మను.

చిదానంద స్వరూపుడనగు శివుడనే నేను, శివుడనే నేను అని తెలిపారు.

రూ.40/-

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు